క్లుప్తంగా

శ్రీరామనవమి శుభాకాంక్షలు

 

నందిగామటౌన్/జగ్గయ్యపేట అర్బన్: శ్రీరామ నవమి సందర్భంగా నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ ఇన్ చార్జి తన్నీరు నాగేశ్వరరావు శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరామనవమి పండుగను ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. శ్రీరాముడి ఆశీస్సులు ప్రజలందరికీ మెండుగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): స్థానిక రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలోని సేతురామమ్మాల్ విద్యా మందిర్ 33వ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు కర్మాగారం ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవత్సవ బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో జీఎం ఫరూక్ మహ్మద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మూర్తి రావు, ఏవో సాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేటకు చెందిన రాగి సుందరాచారి దంపతులు రూ.25వేలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ ఏసీ వరప్రసాద్ శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, దాతలను స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. అదేవిధంగా వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు రూ. 62వేలను విరాళంగా అందించినట్లు ఈఓ సురేష్‌బాబు తెలిపారు.

దుర్గమ్మకు నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు నృత్యార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన నృత్యాచార్య వేదాంతం పార్థసారధి సారథ్యంలో 25 మందికి పైగా కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మ వారి పంచ హారతుల సేవ అనంతరం కళావేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించి వారిని అభినందించారు. అనంతరం కళా బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మచ్చలేని నిస్వార్థ నాయకుడు జగ్జీవన్‌రామ్

నందిగామరూరల్: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆత్మవిశ్వాసమే ఆయుధంగా రాజకీయాలలో అంచలంచెలుగా ఎదిగిన మహోన్నత వ్యక్తి అని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీసెంటరు, ముక్కపాటినగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ విద్యావేత్తగా, మచ్చలేని నిస్వార్థ నాయకునిగా పేరుప్రఖ్యాతలు సంపాదించుకొన్నారన్నారు. కరువు కోరల్లో చిక్కుకొన్న భారతావనిని వ్యవసాయమంత్రిగా హరిత విప్లవాన్ని సాకారం చేసి భారత ఆహార గిడ్డంగులను ఏర్పరచిన దార్శనికుడని కొనియాడారు.

అందరికీ ఆదర్శప్రాయుడు ..

జగ్జీవన్‌రామ్ తన 27వ ఏటే బీహార్ రాష్ట్రంలో శాసనమండలి సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ఆరంభించి తక్కువకాలంలోనే వ్యవసాయ, ఆహార, కార్మిక, ఉపాధి శాఖామంత్రులతోపాటు ఎన్నో అత్యున్నత పదవులను అధిరోహించారని గుర్తుచేశారు. ప్రస్తుత రాజకీయనాయకులు, విద్యార్థులు జగజ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్‌మస్తాన్, నాయకులు పాములపాటి రమేష్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పాకాలపాటి కిరణ్, రామిరెడ్డి సీతయ్య, మాడుగుల మనోహర్, షేక్ సుభానీ, పచ్చాల కోటేశ్వరరావు, మన్నం దాసు, షేక్ జాఫర్, బుగ్గినేని సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్పీ కార్యాలయంలో..

పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించినవారిలో ఆపార్టీ నాయకులు పత్తిపాటి సూర్యం, బచ్చలకూర పుష్పరాజ్, రజనీకాంత్, బాబూజీ తదితరులు ఉన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దళిత జాతి అభ్యున్నతికి భారత మాజీ ఉపప్రధాని, భారతరత్న బాబూ జగ్జీవన్‌రామ్ విశేషంగా కృషిచేశారని వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని పార్టీ మండల అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఓటమి ఎరుగని నాయకుడు జగ్జీవన్‌రామ్ అని, ఆయన ఆశయాలను అందరూ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, ఎంపీటీసీ సభ్యులు చాట్ల సుశీల, కీసర లోకేశ్వరరావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మెండెం రామారావు, నాయకులు కాకాని హరి, తమ్మిశెట్టి సోమయ్య, రాజ్‌కుమార్, చాట్ల సురేష్, నల్లబోతుల వెంకటేష్, మల్లెబోయిన సైదులు, గడాటి పెద్దోడు, బొడ్డు రవి పాల్గొన్నారు.అదేవిధంగా పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పని చేశారని కొనియాడారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనిగండ్లపాడులో..

మండలంలోని అనిగండ్లపాడులోని జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, గ్రామాధ్యక్షులు యానాల సురేష్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, నాయకులు దోసపాటి ప్రసాద్, కొమ్ముకూరి వెంకటరత్నం, నక్కా సుధాకర్, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆయా పార్టీల ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేటఅర్బన్: భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఆయాపార్టీలు, సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొని స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా బస్టాండ్ సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: మాజీఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని కంచికచర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. గండేపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచి బొక్కా రవికుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్పనేత జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. బబూ జగ్జీవన్‌రాం దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్అసిస్టెంట్ బొక్కా మోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా కంచికచర్ల స్థానిక శాఖా గ్రంథాలయంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, పాఠకులు నివాళులర్పించారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఏవో మాధవ శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నందిగామలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు



పెనుగంచిప్రోలులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ మార్కపూడి గాంధీ తదితరులు



జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ పద్మకుమారి, సిబ్బంది



అనిగండ్లపాడులో నివాళులర్పిస్తున్న పొన్నం కోటేశ్వరరావు, గ్రామస్తులు



చిల్లకల్లులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఏఓ మాధవశర్మ, ఉద్యోగులు



పేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం తదితరులు

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



పేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: పేదలు, శ్రామికులు, సామాన్యులు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక సమానత్వం అందించేందుకు మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి తన్నీరుతోపాటు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ పేద, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ నిరంతరం తపిస్తూ తన జీవితాన్ని వారికి అంకితం చేశారన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో కొనసాగించి దేశంలోని నేతలందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలు సఫలీకృతం అవ్వాలంటే అది వైఎస్ జగన్ పాలనతోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: బాబూ జగ్జీవన్‌రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన మహనీయుడని వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురంలో జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన గొప్పనేత జగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్‌బాబు, సొసైటీ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీచైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వీఅన్నవరంలో..

మండలంలోని వీఅన్నవరంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మందా పిచ్చయ్య మాదిగ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిచ్చయ్యమాదిగ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితమంతా సమసమాజ స్థాపనకే అంకితం చేశారని కొనియాడారు. అదేవిధంగా మండలంలోని అల్లూరు, వీరులపాడు, కొణతాలపల్లి, జుజ్జూరు తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

వత్సవాయి మండలంలో..

చిట్టేల(వత్సవాయి): మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మండల పరిధిలోని చిట్టేల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుక్కల సురేష్ కుమార్, మార్కపూడి బాబురావు, అరిగెల రవి, ఎ.నాగభూషణం తదితరులు ఉన్నారు.



వీఅన్నవరంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



చిట్టేలలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



గండేపల్లిలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచి బొక్కా రవికుమార్ తదితరులు

ఉన్నతంగా ఎదిగేందుకు భరోసా: సీఎం

కంచికచర్ల/చందర్లపాడు: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమం సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ విభిన్న ప్రతిభావంతుల శాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సీడీతో కూడిన సెర్ప్–ఉన్నతి వడ్డీలేని రుణాల మంజూరుకు సంబంధించిన స్టాళ్లను సందర్శించి మహిళలతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ద్వారా వివిధ కేటగిరీలకు చెందిన 10మంది లబ్ధిదారులకు రూ. 3.40లక్షల విలువైన ఉపకరణాలు అందించారు. వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, డిగ్రీ కోర్సులు చేస్తున్న నలుగురికి ల్యాప్‌ట్యాబ్‌లు, వీల్ చైర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న సీఎం చంద్రబాబు

ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు..

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక కార్యక్రమానికి 10.30గంటలకు రావాల్సి ఉండగా, అరగంట ఆలస్యంగా వచ్చారు. ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు హెలీప్యాడ్ ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాల ఆవరణలో వేచి ఉండగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవరణ బయటే వేచి ఉండాల్సి వచ్చింది. సీఎం చంద్రబాబు గురుకుల పాఠశాలను సందర్శన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సైతం ఎండలోనే వేచి ఉన్నారు. ప్రజావేదిక సభా ప్రాంగణంలో వేచి ఉన్న ప్రజలు ఉక్కపోతతో ఒకింత అవస్థలు పడ్డారు.

వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకువద్దాం

తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేలా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆపార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారికి అభినందనసభ నిర్వహించారు. సన్మానగ్రహీతల్లో వైఎస్సార్ సీపీ ఆయా విభాగాల అధ్యక్షులు చల్లా సుశీల, జవ్వాజి నరసింహారావు, బాణావత్ రాజు, బసిపోగు ఆనందపాల్, వేముల నాగార్జున, వేల్పుల నవీన్, ఆటిపాముల వెంకన్న, ధరావత్ శ్యామల, ఓర్సు రాజు, కారుపాటి జీవరత్నం, బండి రంజిత్ కుమార్, బైరబోయిన బాబులను దుశ్శాలువలు, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు అందరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు లాహోరు బద్దునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, వేముల మల్లేశ్వరరావు, నాగబాబు, పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాస్, నంబూరి రవి, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, పట్టణ వలంటీర్ విభాగం అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ ఆశీర్వాదం, పట్టణ మున్సిపల్ విభాగం అధ్యక్షుడు అన్నెపాగ మురళి, పట్టణ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు దారెల్లి మహేష్, కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు గంగోలు వినోద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పింగళి నర్సింహారెడ్డి, నాయకులు బీఎస్ఎన్ఎల్ రామారావు, దార్ల ప్రసన్నకుమార్, మన్నె అప్పారావు, అన్నాబత్తుల శ్రీనివాసరావు, దేరంగుల శ్రీనివాసరావు, పాతకోటి ఉదయభాను, బుల్లియ్య, పిట్టల సత్యనారాయణ, మంగారావు పాల్గొన్నారు.



సన్మానగ్రహీతలతో తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

క్షేత్రపాలకుడికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీ ఆంజనేయస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఆంజనేయ స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆలయంతో పాటు పాత మెట్ల మార్గం వద్ద ఉన్న స్వామివారి ఆలయంలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత ఘాట్‌రోడ్డులోని ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ, నాగవల్లీ దళార్చన (తమలపాకులతో అర్చన)ను నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజలలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. చైత్ర శుద్ధ అష్టమిన క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఘాట్‌రోడ్డులోని స్వామివారు

ముస్తాబైన రామాలయాలు

వత్సవాయి : శ్రీరామనవమి పర్వదిన వేడుకలకు మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. మక్కపేట, గోపినేనిపాలెం, మంగొల్లు, భీమవరం, వత్సవాయి, కంభంపాడు, పోలంపల్లి, వేములనర్వ తదితర గ్రామాల్లోని రామాలయాలను భక్తులు ముస్తాబు చేశారు. రంగులతో ఆలయాలను తీర్చిదిద్దడమే కాకుండా సీతారామ కల్యాణాన్ని తిలకించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పందిళ్లు వేయించారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. నవమి సందర్భంగా తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని అర్చకులు తెలిపారు. నవమిని పురస్కరించుకుని అనుమతులు లేకుండా గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్ఐ పి. ఉమామహేశ్వరరావు సూచించారు.



విద్యుద్దీపాలంకరణలో భీమవరంలోని రామాలయం

ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్

కంచికచర్ల : నూతన ప్రభుత్వం ఏర్పడి పదిమాసాలు పూర్తయిందని ప్రభుత్వం చెప్పిన హామీల్లో పెన్షన్ చెల్లించడం మినహా ఏమీ చెయ్యలేదని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్ష్యుడు సానె రామ్మోహనరావు అన్నారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యాలయంలో శనివారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ మేరకు రామ్మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ఇస్తామన్నారు, కాని ఇంతవరకు కమిషన్ ఏర్పాటు చేయకపోగా ఐఆర్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్క డీఏ కూడా ప్రకటించలేదని ఆరోపించారు. 11వ పీఆర్‌సీ బకాయిలు, ఏడీ బకాయిలను ఒకేసారి లేక వాయిదాల పద్ధతిలోనైనా చెల్లించాలన్నారు. చాలామంది పెన్షనర్స్ బకాయిలు తీసుకోకుండా మృత్యువాతపడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా 70,75 ఏళ్ల పెన్షనర్లకు తగ్గించిన ఎడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం విజయవాడకు చెందిన మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వారిలో నలుగురిని కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారని అన్నారు. సమావేశంలో ట్రెజరర్ చలసాని నాగేశ్వరరావు, పెద్దినీటి కోటేశ్వరరావు సీహెచ్ స్వర్ణలత, బీవీ సర్వేశ్వరరావు, బి. కృష్ణమూర్తి, పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామ్మోహనరావు